క్లుప్తంగా

అండగా ఉంటాం



నివాళులర్పిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందుల రూరల్ : వైఎస్సార్‌సీపీ కార్యకర్త వినయ్‌కుమార్ బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ మృతుడి నివాసం వద్దకు వెళ్లి వినయ్‌కుమార్ మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రసూల్, తదితరులు పాల్గొన్నారు.

ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీలకు శిక్షణ తరగతులు

లింగాల : స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో బుధవారం అన్ని ప్రభుత్వ పాఠశాలల ఇంప్లిమెంటింగ్ ఏజెన్సీలకు, ఆయాలకు ఒకరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ–2 రామకృష్ణయ్య మాట్లాడుతూ పాఠశాల్లోని పిల్లలకు నాణ్యమైన భోజనం వండి వడ్డించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ప్రతిరోజు రుచికరమైన ఆహారాన్ని అందించాలన్నారు. వంట చేసే ప్రదేశాలను, వంట పాత్రలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అదేవిధంగా ఆయాలు పిల్లలతో ఎలా ప్రవర్తించాలి, పరిసరాలను ఎలా పరిశుభ్రంగా ఉంచుకోవాలి, మరుగుదొడ్లను ప్రభుత్వం అందించిన మెటీరియల్‌తో ఎలా పరిశుభ్రం చేసుకోవాలన్న అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్సీ సిబ్బంది, అన్ని పాఠశాలల సీసీహెచ్‌లు, ఆయా పాల్గొన్నారు.

అవగాహన సదస్సు



పులివెందులలో 1కే వాక్ కార్యక్రమంలో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది

పులివెందుల రూరల్ : పట్టణంలోని స్థానిక సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో బుధవారం న్యాయవాదులు, కోర్టు సిబ్బంది ప్రజలకు పులివెందుల మండల లీగల్‌సెల్ వలంటీర్ల మధ్యవర్తిత్వంపై అవగాహన సదస్సు నిర్వహించారు. పులివెందుల బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ తులసీరాం ఆధ్వర్యంలో 1కే వాక్ కార్యక్రమం నిర్వహించారు.

సమస్యలపై దృష్టి సారించండి



మాట్లాడుతున్న ఎంపీపీ వరలక్ష్మి

పులివెందుల రూరల్ : గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ వరలక్ష్మి తెలిపారు. గురువారం పట్టణంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఎంపీడీఓ రామాంజనేయరెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో నెలకొన్న పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ముఖ్యంగా గ్రామాలలో తాగునీరు, వీధిలైట్ల సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. హెచ్‌ఓ రాఘవేంద్రారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గ రైతులకు కావాల్సిన పండ్ల మొక్కలను అందించామన్నారు. పండ్ల మొక్కలు కావాల్సిన రైతులు అధికారుల దృష్టికి తీసుకరావాలన్నారు. ఎంఈఓ–2 రామానాయుడు మాట్లాడుతూ పాఠశాలలో పిల్లల చదువుల కోసం అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, అన్ని శాఖల అధికారులు, పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

పెండ్లిమర్రి : మండలంలోని మాచునూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మండల కన్వీనర్ మాచునూరు చంద్రారెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో చౌటపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, అట్టలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రత్యేక శిక్షణ

చింతకొమ్మదిన్నె : మండలంలో ఓటర్ల జాబితా సవరణ కొరకు స్థానిక జెడ్పీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం బూత్‌స్థాయి అధికారులకు తహసీల్దార్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ బూత్‌స్థాయి అధికారులు ఇంటింటి సర్వే ఏ విధంగా నిర్వహించాలి, కొత్త ఓటర్ల నమోదు, మరణించిన వారి ఓటును, వలస వెళ్లిన వారి ఓటును ఏ విధంగా తొలగించాలి, ఓటరు జాబితాలో సవరణలు ఏ విధంగా చేయాలనే అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కమలాపురం ఎన్నికల డీఈ అహల్య, ఏఎస్‌ఓ చంద్రకళ, ఆర్ఐ వీరేంద్ర, బూత్‌స్థాయి అధికారులు, పర్యవేక్షకులు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల ఎదురుచూపులు

- ఆర్ఎస్‌కేలలో అందుబాటులో లేని యూరియా
- సాగులో ఉన్న పంటలకు అందక ఇక్కట్లు
- రైతులను వెంటాడుతున్న యూరియా కొరత



వేల్పుల వద్ద సాగులో ఉన్న ఉల్లి పంట



వేముల వద్ద సాగులో ఉన్న అరటి పంట

వేముల : ప్రస్తుత పరిస్థితులలో పంటలు సాగు చేయాలంటే రసాయనిక ఎరువుల వాడకం తప్పనిసరి. పంటలు సాగు చేశాక అవసరమైన ఎరువులు అందుబాటులో లేకపోవడంతో ఏ విధంగా దిగుబడులు తీయాలో తెలియని పరిస్థితిలో రైతులు ఉన్నారు. ప్రస్తుతం సాగులో ఉన్న పంటలకు యూరియా కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. ఎక్కడా యూరియా దొరకకపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఒకప్పుడు ఎక్కడ చూసినా అందుబాటులో ఉన్న యూరియా నేడు అందుబాటులో లేకపోవడంతో రైతులు అల్లాడిపోతున్నారు.

యూరియ కోసం రైతుల ఎదురుచూపులు

ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన రైతులు యూరియా కోసం ఎదురు చూస్తున్నారు. పంటలకు అదునులో యూరియా వేయాల్సి ఉండటంతో యూరియా కోసం అన్ని ఫర్టిలైజర్స్ దుకాణాలలో అడుగుతున్నా యూరియా లేదనే సమాధానం వస్తోందని రైతులు అంటున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఖరీఫ్‌లో వ్యవసాయ బోర్లు, బావుల కింద రైతులు పంటలు సాగు చేశారు. ఎక్కువగా ఉల్లి, చామంతి, అరటి, మినుము, కూరగాయ పంటలు సాగులో ఉన్నాయి. ఈ పంటలకు యూరియా వాడకం తప్పనిసరి. ముఖ్యంగా ఉల్లి పంటకు యూరియా వేయాల్సి ఉంటుంది. దీంతో యూరియా కోసం ఎక్కడికి వెళ్లినా లేదనే సమాధానం వస్తోంది.

ఆర్ఎస్‌కేలలో అందుబాటులో లేని యూరియా

రైతులకు వెన్నుదన్నుగా నిలిచే రైతు సేవా కేంద్రాలు వెలవెలబోతున్నాయి. రైతు సేవా కేంద్రాలలో కూడా యూరియా అందుబాటులో లేదు. యూరియా సరఫరా ఎందుకు లేదని అడిగితే ఎవరి వద్ద సమాధానం లేదని రైతులు అంటున్నారు. గత ప్రభుత్వంలో నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని రైతు భరోసా కేంద్రాలలో యూరియా నిల్వ ఉండేదని రైతులు అంటున్నారు. యూరియా అందక రైతులు ఇక్కట్లు పడుతున్నా ఉన్నతాధికారులు పట్టించుకోలేదు. పైగా డివిజన్‌స్థాయి అధికారి యూరియా కావాలని అడిగితే జిల్లా ఉన్నతాధికారులు మెమో ఇవ్వడంతో యూరియా గురించే అడిగే పరిస్థితి లేకుండాపోయింది.

సాగులో ఉన్న పంటలకు యూరియా అందక ఇక్కట్లు

నియోజకవర్గ వ్యాప్తంగా సాగులో ఉన్న పంటలకు యూరియా అందక రైతులు ఇక్కట్లు పడుతున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 3 వేల ఎకరాలలో ఉల్లి, 10 వేల ఎకరాలలో అరటి, 2వేల ఎకరాలలో చామంతి, వెయ్యి ఎకరాలలో మినుము పంటలు సాగులో ఉన్నాయి. ఈ పంటలకు నీటి తడులు ఇచ్చే ముందు యూరియా తప్పనిసరిగా వేయాల్సి ఉంటుంది. దీంతో రైతులు ఆర్ఎస్‌ఏల చుట్టూ, ఫర్టిలైజర్స్ దుకాణాల చుట్టూ తిరుగుతున్నా యూరియా మాత్రం దొరకడంలేదు. రైతులకు యూరియా డిమాండ్ ఉన్నప్పటికి ఉన్నతాధికారులు సరఫరా చేయాలనే ఆలోచన లేకపోవడంపై రైతులు మండిపడుతున్నారు.

రసాయనిక ఎరువు తీసుకుంటే.. బస్తా యూరియా

యూరియా కొరతను ఎరువుల దుకాణాల యజమానులు ఆసరాగా చేసుకుని రైతులను వాడుకుంటున్నారు. రైతు సేవా కేంద్రాలలో యూరియా అందుబాటులో లేకపోవడం, మార్కెట్‌లో యూరియా కొరత ఉండటం దుకాణదారులకు కలిసొచ్చింది. రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుని యూరియా బస్తా కావాలంటే రసాయనిక ఎరువు బస్తా తీసుకోవాలని ఎరువుల దుకాణాల యజమానులు షరతు విధిస్తున్నారు. దీంతో యూరియా కోసం రైతులు తప్పని పరిస్థితులలో అవసరం లేకపోయినా ఎరువుల బస్తా కొనుగోలు చేస్తున్నారు. దీంతో యూరియా కొనుగోలు చేసే రైతులకు అదనపు భారం పడుతోంది. ముఖ్యంగా వరి సాగు చేసిన రైతులకు యూరియా ఎంతో అవసరం. యూరియా కోసం ఎదురుచూసిన సరఫరా లేక దొరకకపోవడంతో యూరియారెండు బస్తాలు కావాలంటే.. రెండు బస్తాలు ఎరువులు కొనుగోలు చేస్తున్నామని రైతులు వాపోతున్నారు.

యూరియా దొరకడంలేదు



సాగులో ఉన్న పంటలకు యూరియా దొరకడం లేదు. యూరియా కోసం ఎదురుచూసి దొరకక ఇతర రసాయనిక ఎరువులను వేస్తున్నాం. దీంతో సాగు ఖర్చులు పెరిగిపోతున్నాయి. అరటి పంటకు యూరియా ఎంతో అవసరం. యూరియా లేక ఇబ్బందులు పడుతున్నారు. అవసరమైన యూరియా రైతులకు అందుబాటులో ఉంచాలి.

– రవికుమార్‌రెడ్డి, అరటి రైతు, వేల్పుల

మూడు ఎకరాలలో ఉల్లి సాగు చేశా



నాకున్న మూడు ఎకరాలలో ఉల్లి సాగు చేశా. ఎకరా ఉల్లి సాగుకు రూ.50 వేలకుపైనే పెట్టుబడులు పెడుతున్నాం. ఉల్లిలో కలుపు తీసి యూరియా వేయాలంటే అందుబాటులో యూరియా లేదు. యూరియా కోసం ఎదరు చూస్తున్నా దొరకడంలేదు. పంటలకు అవసరమైన యూరియాను సరఫరా చేసి రైతులకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– గంగిరెడ్డి, ఉల్లి రైతు, గొందిపల్లె

రేపు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. చర్మ వ్యాధుల ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బొదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణభేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, చెవి, ముక్కు, గొంతులకు సంబంధించిన అనేక సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

క్లబ్‌లపై పోలీసుల దాడులు

పులివెందుల రూరల్ : పట్టణంలోని క్లబ్‌లపై బుధవారం సాయంత్రం పులివెందుల అర్బన్ సీఐ చాంద్‌బాషా ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. పేకాట ఆడినా, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలను నిర్మూలిద్దాం

కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



పోస్టర్లను ప్రదర్శిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల : సామాజిక స్పృహతో మాదక ద్రవ్యాలను నిర్మూలిద్దామని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక మినీ సచివాలయ ఆవరణలో ఎంపీ చేతులమీదుగా స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల మత్తు బారినపడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. యువత గంజాయి, పొగాకు లాంటి మత్తు పదార్థాలతో ఎదురయ్యే సమస్యలపట్ల అవగాహన కలిగి, వాటి జోలికి పోకుండా జాగ్రత్త పడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అంతకముందు భాకరాపురంలోని తన నివాసంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల సమస్యలకు సంబంధించిన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎంపీ ప్రజలకు సంబంధించిన సమస్యలపై అధికారులతో ఫోన్లలో మాట్లాడి వాటి పరిష్కారానికి కృషి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చిన్నప్ప, పట్టణ కన్వీనర్ హాలు గంగాధరరెడ్డి, పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లె కిశోర్, వైఎస్సార్‌సీపీ నాయకులు బలరామిరెడ్డి, బయపురెడ్డి, సాంబశివారెడ్డి, రసూల్, చంద్రమౌళి, నూరుల్లా, సేవా సమితి సభ్యులు సురేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రీయ వ్యవసాయంపై దృష్టి సారించండి



రైతులకు కందుల మినీ కిట్లను అందిస్తున్న జేడీఏ చంద్ర నాయక్

వేముల : పంటల సాగులో సేంద్రీయ వ్యవసాయంపై దృష్టి సారించాలని వ్యవసాయ శాఖ జేడీ చంద్ర నాయక్ రైతులకు సూచించారు. మండలంలోని దుగ్గన్నగారిపల్లెలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పంటలు సాగు చేసేముందు రైతులు భూసార పరీక్షలను అనుసరించి ఎరువుల వాడకం చేపట్టాలన్నారు. మోతాదుకు మించి ఎరువులను వాడటం వల్ల పెట్టుబడులు పెరిగిపోయి సాగులో నష్టాలు వస్తున్నాయన్నారు. దీన్ని అధిగమించాలంటే ఎప్పటికప్పుడు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటించి ఎరువులను వాడాలన్నారు. రైతులకు 50 శాతం సబ్సిడీతో జింక్, జిప్సం ఇస్తున్నామన్నారు. రైతులకు వ్యవసాయానికి అవసరమైన యాంత్రీకరణ పనిముట్లను రాయితీతో అందిస్తున్నామని, అవసరమైన రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎరువుల కొరతను అధిగమించేందుకు ఎరువులను తగినన్ని అందుబాటులో ఉంచామన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కుటుంబంలో ఒకరికి మాత్రమే వర్తిస్తుందన్నారు. పంట సాగు చేసిన రైతులు ఏ పంట సాగు చేస్తే ఆ పంటకు ఇ–క్రాఫ్ నమోదు చేయించుకోవాలన్నారు. అలాగే ఇ–క్రాఫ్ ఆధారంగానే రైతులకు ఇన్సూరెన్స్, పంట నష్టం వర్తిస్తాయన్నారు. పంటలకు ఇన్సూరెన్స్ గడువు పెంచాలని రైతులు కోరడంతో ఉన్నతాధికారులకు నివేదిక పంపామన్నారు. అలాగే పంటలకు మందులను పిచికారి చేసేందుకు డ్రోన్ పరికరాలను 80 శాతం సబ్సిడీతో ఇస్తున్నామన్నారు. ఆసక్తిగల రైతులు ముందుకు రావాలని సూచించారు. మండలానికి 810 మినీకిట్లు కందులు, 610 మినీకిట్ల మినుములు, 50 మినీ కిట్లు జొన్నలు మంజూరయ్యాయని, వీటిని రైతులకు ఉచితంగా ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి, ఏఓ ఓబులేసు, ఏఈఓ సురేష్, సర్పంచ్ చెన్నారెడ్డి, ఆర్ఎస్‌కే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంతోనే శాంతియుత పరిష్కారం



జమ్మలమడుగులో మండల లీగల్ సర్వీస్ ర్యాలీలో పాల్గొన్న జడ్జి భార్గవి, న్యాయవాదులు



కమలాపురం : ర్యాలీలో పాల్గొన్న మెజిస్ట్రేట్ మధుసూదన్‌రావు

జమ్మలమడుగు రూరల్ : న్యాయవ్యవస్థలో మధ్యవర్తిత్వం ఒక శాంతియుత పరిష్కార మార్గమని జమ్మలమడుగు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎస్.భార్గవి తెలిపారు. బుధవారం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ నిర్వహించిన మధ్యవర్తిత్వం కోసం జాతీయ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ మధ్యవర్తిత్వం ద్వారా ఇరుపక్షాల మధ్య వాదనలు తీర్చడం సులభమవుతందన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వం ద్వారా కేసులు పరిష్కరించుకోండి

కమలాపురం : కక్షిదారులు మధ్యవర్తిత్వం ద్వారా కేసులు పరిష్కరించుకోవాలని కమలాపురం జూనియర్ సివిల్ కోర్టు మెజిస్ట్రేట్ మధుసూదన్‌రావు తెలిపారు. బుధవారం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో కోర్టు ప్రాంగణం నుంచి రైల్వే గేట్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మెజిస్ట్రేట్ మాట్లాడుతూ కక్షిదారులు మధ్యవర్తి సహాయంతో వివాదాలు పరిష్కరించు కోవడం మంచి మార్గమన్నారు. మధ్యవర్తిత్వం ఒక న్యాయ ప్రక్రియ అని, ఈ ప్రక్రియ ద్వారా కేసులు సులభంగా పరిష్కరించు కోవచ్చని, కక్షిదారులు ఈ ప్రక్రియన సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు, కోర్టు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పంటల బీమాను సద్వినియోగం చేసుకోండి

కమలాపురం : పంటలు సాగు చేసే రైతులందూరు బీమా ప్రీమియం చెల్లించి పంటల బీమాను సద్వినియోగం చేసుకోవాలని మండల ఏఓ సరస్వతి తెలిపారు. బుధవారం మండలంలోని చిన్నచెప్పలి, బయనపల్లె గ్రామాలలో జరిగిన పొలం పిలుస్తోంది. కార్యక్రమంలో ఆమె క్షేత్ర స్థాయిలో పర్యటించి ఉల్లి పంటను పరిశీలించారు. చిన్నచెప్పలి గ్రామ రైతులు ఎక్కువగా ఉల్లి పంటను సాగు చేశారని, పంటలో ఎరువుల యాజమాన్యం, సస్యరక్షణ గురించి అవగాహన కల్పించారు. ఉల్లి పంటకు ఏకరాకు రూ.90 బీమా ప్రీమియం చెల్లిస్తే రూ.45వేల వరకు బీమా వర్తిస్తుందన్నారు. మినుము, జొన్నకు రూ.38 చెల్లిస్తే రూ.19వేల వరకు బీమా వర్తిస్తుందన్నారు. వరి పంటకు ఏకరాకు రూ.84 చెల్లిస్తే రూ.42 వేల వరకు బీమా వర్తిస్తుందన్నారు. బీమా ప్రీమియం ఈనెల ఆఖరు చెల్లించవచ్చునన్నారు.

బ్యాంకు తీరుతో రైతులపై ఆర్థికభారం

ముద్దనూరు : స్థానిక కెనరా బ్యాంకులో పంటరుణాల రెన్యువల్స్‌లో తీసుకుంటున్న నిర్ణయాల వల్ల రైతులపై ఆర్థికభారం పడుతోంది. పంటరుణాల రెన్యువల్స్ సందర్భంగా రైతులు సాధారణంగా పంటరుణంపై వడ్డీ మాత్రమే చెల్లించి రెన్యువల్ చేయాల్సివుంది.అయితే స్థానిక కెనరా బ్యాంకులో పంటరుణాల మొత్తాన్ని పెంపుదల(బాండు మార్చడం)లో పంటరుణం అసలుతో పాటు వడ్డీ కూడా చెల్లించాలనే షరతు విధించారు. గతంలో ఎప్పుడూ ఇటువంటి సమస్యను ఎదర్కోలేదని, వడ్డీ సొమ్ముతో పాటు లక్షలాది రూపాయలు అసలు మొత్తంను చెల్లించాల్సివస్తోందని దీంతో తమపై తీవ్రమైన ఆరిక్ధభారం పడుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కువమంది రైతులు పంటరుణం వడ్డీలు కూడా చెల్లించేస్థితిలో లేరు. పంటరుణం అసలుమొత్తాన్ని పెంచుకోవాల్సివస్తోందని, ఈ తరుణంలో లక్షలరూపాయల అసలు మొత్తంతో పాటు వడ్డీచెల్లించాలనే నిబంధన విధించడం అన్యాయమని రైతులు వాపోతున్నారు. దీనికి తోడు బాండుమార్చే సమయంలో బ్యాంకు పత్రాల, దరఖాస్తు పేరుతో ఒక్కో రైతునుంచి అదనంగా రూ.150లు అనధికారికంగా ఓ ప్రైవేటు వ్యక్తితో వసూలు చేయిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఇదిలావుండగా అసలు, వడ్డీ రెండూ చెల్లించాల్సివుండటంతో కొందరు దళారులు కూడా రంగ ప్రవేశం చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

ఆడపిల్లలను కాపాడుకుందాం

జమ్మలమడుగు : ఆడపిల్లలు ఇంటికి వెలుగుగా భావించాలని ఆర్డీఓ సాయిశ్రీ తెలిపారు. బుధవారం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ గీతా ఆధ్వర్యంలో సబ్ డిస్ట్రిక్ లెవల్ మల్టిమెంబర్ అథారిటీ కమిటీ మీటింగ్‌ను ఆర్డీఓ ఛాంబర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ అధికారులు క్షేత్ర స్థాయిలో గర్భిణులకు, అత్తా మామలకు అవగాహన కల్పించాలన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ప్రైవేట్ ఆసుపత్రుల్లో, స్కానింగ్ సెంటర్లలో స్కానింగ్ చేసి లింగ నిర్ధారణ చేయడం చట్టరీత్యానేరం అన్నారు. అలా ఎవరైన చేస్తే స్కానింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవడంతోపాటు డాక్టర్లపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రతి కార్యకర్త టీడీపీ వైఫల్యాలను ప్రజలకు చెప్పాలి

కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

జమ్మలమడుగు : ఎన్నికల సమయంలో టీడీపీ నాయకులు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంపై వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రతి ఇంటికి వెళ్లి అమలు తీరుపై ప్రజలు ప్రశ్నించేవిధంగా చేయాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మైలవరం మండల నాయకులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతి కార్యకర్త గ్రామాల్లో వైఎస్సార్‌సీపీని బలోపేతం చేయడం కోసం తమవంతు బాధ్యతగా కష్టపడి రాబోయే స్థానిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలం ఎమిటో చూపిద్దామని పిలుపునిచ్చారు. గ్రామాల్లో కార్యకర్తలకు తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. గ్రామాల్లో బాబు షూరిటీ–మోసం గ్యారంటీ గురించి ప్రతి ఇంటికి వెళ్లి వారింట్లో ఎంత మందికి తల్లికి వందనం పడింది, అన్నదాత సుఖీభవ పడింది, ఆడబిడ్డ నిధి ఎంత ఇచ్చారు, నిరుద్యోగులకు మూడు వేల రూపాయలు ఎంత మందికి ఇచ్చారు పూర్తి స్థాయిలో వివరించాలన్నారు. అదేవిధంగా స్థానిక ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి రాజోళి ఆనకట్టకింద ముంపు గ్రామాలకు ఎకరాకు రూ.24 లక్షలు ఇస్తామని ప్రకటించారు. పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలుస్తారన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు ధన్నవాడ మహేశ్వరరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్‌రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గుర్విరెడ్డి, గిరిధర్‌రెడ్డి, వేంపలాకు రామాంజనేయ యాదవ్, నవాబుపేట భాస్కర్‌రెడ్డి, తలమంచిపట్నం వినయ్‌కుమార్‌రెడ్డి, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

కాలి బాటలతో దోమపోటు నివారించవచ్చు



రైతులకు కంది ప్యాకెట్లను అందిస్తున్న జేడీఏ

వేంపల్లె : రైతులు వరి పంట సాగులో కాలి బాటలు వేసుకొంటే దోమపోటును నివారించవచ్చునని వ్యవసాయ శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ చంద్ర నాయక్ తెలిపారు. బుధవారం వేంపల్లెలో పోలం పిలుస్తోంది కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జేడీఏ మాట్లాడుతూ రైతులందరూ తమ భూములకు భూసార పరీక్షలు చేయించాలని, భూసార పరీక్షలను అనుసరించి పంటలకు ఎరువులను వాడాలన్నారు. పంట సాగు చేసిన ప్రతి రైతు పంటల బీమాను చేయించాలని, వరి పంట సాగులో ఎక్కువగా పాత రకాలైన బీపీటీ– 5204 రకం వేస్తున్నారని, వాటి వలన ఎక్కువ రోగాలు వచ్చి పంట దిగుబడి తగ్గే అవకాశం ఉంటుందన్నారు. బీపీటీ 5204 స్థానంలో కొత్త వంగడాలైన ఆర్ఎన్ఆర్–1502, కెఎన్ఎం 1632 వంటివి సాగు చేయాలన్నారు. ప్రతి పంటలో సరైన విత్తనాలను మోతాదులో వేయాలని లేకపోతే ఖర్చులు, పెట్టుబడులు అధికమవుతాయన్నారు. అరటి రైతులు పంటకు అధిక మోతాదులో యూరియా వాడుతున్నారని, వాటి వలన అరటి గెలలు గాలులకు నేలవాలడంతోపాటు దిగుబడి కూడా తగ్గుతుందన్నారు. డ్రోన్ కావాల్సిన రైతులు ఏఓ శివశంకరరెడ్డిని కలవాలన్నారు. అనంతరం జేడీఏ రైతులకు కంది ప్యాకెట్లును పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి, ఏఈఓ మల్లికార్జున, వీఏఏ వినోద్, రైతులు పాల్గొన్నారు.

ప్రజలను మోసగించడంలో చంద్రబాబు దిట్ట

– వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పీ రవీంద్రనాథ్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి

వల్లూరు : ప్రజలను మోసగించడంలో చంద్రబాబు దిట్ట అని వైఎస్ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పీ రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా వల్లూరులో వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్ అబ్బిరెడ్డి వీరారెడ్డి అధ్యక్షతన బుధవారం జరిగిన మండల స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం చంద్రబాబు పాలనలో ప్రజలకు చేస్తున్న మోసాలను ఎండగట్టారు. ఎన్నికలకు ముందు ప్రజలను వంచించి అనేక హామీలు ఇవ్వడం, అధికారంలోకి వచ్చాక వాటిని తుంగలో తొక్కి ప్రజలను మోసగించడంలో చంద్రబాబు సిద్ధహస్తుడన్నారు. జగన్ పాలనంతా ప్రజా సంక్షేమం, అభివృద్ధి ప్రధాన ధ్యేయంగా సాగిందన్నారు. బాబు ష్యూరిటీ – భవిష్యత్తుకు గ్యారెంటీ అంటూ అధికారంలోకి వచ్చిన చంద్రబాబు పాలనలో కేవలం ఆయన కొడుకు భవిష్యత్తుకు మాత్రమే ష్యూరిటీ లభించింది తప్ప ప్రజలకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదని విమర్శించారు. జగన్ 5 సంవత్సరాల పాలనలో రూ.3 లక్షల 65 వేల కోట్లు అప్పు చేసినప్పటికీ ప్రతి పైసాను సద్వినియోగం చేశారని గుర్తు చేశారు. గ్రామ స్థాయిలో సైతం కనిపిస్తున్న సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాలు, కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చెందిన ప్రభుత్వ పాఠశాలలు నేటికీ అభివృద్ధికి సాక్ష్యాలుగా నిలుస్తున్నాయన్నారు. ప్రతి ఇంటికి, ప్రతి వ్యక్తికి సంక్షేమ పథక ఫలాలు అందాయని ఉదహరించారు. ప్రస్తుతం చంద్రబాబు తన 14 నెలల పాలనలోనే 1 లక్షా 86 వేల కోట్లు అప్పులు చేశారని, అయినా ఎన్నికలకు ముందు ఆయన చెప్పిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండా ప్రజలను మరోమారు మోసగించారని మండిపడ్డారు. మనందరి తలలను తాకట్టు పెట్టి అప్పు చేసి తెచ్చిన నిధులను అమరావతి అభివృద్ధికి అంటూ కాంట్రాక్టర్లకు మొబిలైజ్డ్ అడ్వాన్స్ కింద 10 శాతం నిధులను అందించి, వాటిని దొడ్డిదారిన తన ఖాతాకు మళ్లించుకుంటూ అడ్డంగా దోచుకుంటున్నారని విమర్శించారు. జగన్ అధికారంలోకి వచ్చాక పెన్షన్‌లను 33 లక్షల నుండి 66 లక్షల మందికి పెంచగా, ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఇప్పటి వరకు 5 లక్షలకు పైగా పెన్షన్లను తొలగించారని, ఒక్క కొత్త పెన్షన్ ఇవ్వక పోగా మరిన్ని పెన్షన్‌లను తగ్గించడానికి వివిధ రకాల సర్వేలను చేపడుతున్నారని అన్నారు. టీడీపీ పాలనలో మన పార్టీ నేతలు, కార్యకర్తలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో టీడీపీ 14 నెలల పాలనలో విసిగి పోయిన ప్రజల్లో కావాలి జగన్ – రావాలి జగన్ నినాదం రోజు రోజుకూ బలపడుతోందన్నారు. టీడీపీ వైఫల్యాలను ప్రతి ఒక్కరం ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ అబ్బిరెడ్డి వీరారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి శంకర్‌రెడ్డి, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కిషోర్ కుమార్, పార్టీ నేతలు రామ కృష్ణారెడ్డి, సుబ్బారెడ్డి, నాగసుబ్బారెడ్డి, శివకుమార్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, నాగిరెడ్డి, ఓబుల్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, సిద్దారెడ్డి, కృష్ణారెడ్డి, రాజన్న, చంద్రారెడ్డి, మస్తాన్, పుల్లయ్య, అంకిరెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

సింహాద్రిపురం : అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రవికుమార్ హెచ్చరించారు. బుధవారం సింహాద్రిపురంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న షాపులను ఆయన తనిఖీ చేసి స్పెషల్ డ్రైవర్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలు, దేవాలయాల వద్ద మత్తు పదార్థాలు అమ్మకూడదన్నారు. విద్యార్థులు కూడా చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా విద్యార్థుల తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలన్నారు. వాహనాలను తనిఖీ చేసి లైసెన్స్‌లు లేని వారికి, వాహన పత్రాలు లేని వారికి జరిమానా విధించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.